
# గుండె లేని  పాడు రేడియో!

● ఘట్టి కృష్ణమూర్తి ●

సాయంత్రం సార్కులో కూచున్నది రుక్మిణి కాసే పటికల్లా రాధాకృష్ణ మాట్లాడుతాడు రేడియోలో...

కొన్న తను వ్రాసియిచ్చిన కథనుగురించి కూడ మాట్లాడుతానన్నాడు. తన కథ అతనికి గొప్ప ఆనందాన్నిచ్చింది.

ఎంతో మురిసిపోతూ తనవంక చూశాడు. తన కథే పదివేలు అనుకుంది- అతనికి అనేక అమూల్యమైన కానుక అనుమన్నది. ఇంకా తనెంత కథనైనా వ్రాయగలను అనుకున్నది.

తన కథ సారస్వతంలో ఉత్తమస్థానాన్ని అలంకరించుతుంది అన్నాడు. తను వ్రాసిన కథను అతను మెచ్చుకున్నాడు. అంతకంటే తనకేం కావాలి ? అతన్నంతగా సంతోషపెట్టిన తన కథ నిజంగా ఉత్తమస్థానాన్ని అలంకరించదు ?

... ... ...

చేతినున్న గడియారం చూసుకుంది రుక్మిణి. ఇంకా అరగంట టైము మిగిలి వున్నది.

అబ్బా ఎంతసేపటికీ టైము కాదే.

ఏవో ఏవో కార్యక్రమాలు జరుగుతున్నాయ్. అవన్నీ తనకెందుకు ?

రాధాకృష్ణుడి ప్రసంగం ముందుగా పెట్టకూడదు ?

ఐనా తనంత ఆద్దుర్దా వాళ్ళకెందుకుండాలో?

సారస్వత వీధుల్లో రాధాకృష్ణుడు తన కథని గురించి ఏం చెబుతాడో ?

... ... ...

ఎంతసేపు కూచున్నా ఒక్కనిముషంకూడ గడవదు టైము నిలుచునిపోతోందా ఏమిటి ? రాధాకృష్ణుడు వెళ్ళినవాడు మాట్లాడడు ?

ఏమిటిది గడియారం వెనక్కు తిరుగుతోందా?

అదుగో వాళ్ళనాన్న వాళ్ళు వచ్చారు అందుకే కావున్న.

వాళ్లెవరో రాధాకృష్ణుడి సంగతే చెప్పుకుంటూ పోతున్నారు. బహుశః వీళ్ళంతా అతని స్నేహితులు కావున్న. వాళ్ళందరూ రాధాకృష్ణ మాట్లాడుతాడనే వచ్చారు. తనూ అందుకేగా కూచుంది,

ఈపాటికే రాధాకృష్ణ రేడియోస్టేషన్ కు వస్తాడు. అతను వ్రాసిన వ్యాసాన్ని మరొకసారి చూసుకుంటూంటాడు.

తన కథనిగురించి ఏం వ్రాశాడో...

... ... ...

ఇంకా పావుగంట కూచోవాలి.

ఆలిండియా రేడియో తెలుగులో వార్తలు. మధ్యన వీడొకడు పావుగంట వాగుతాడీ వార్తలన్నీ.

ఇలా అనుకుంటూండగానే రేడియోలోంచి ఒకమాట వినపడింది.

రాత్రి మద్రాసు వచ్చే ప్యాసింజరు ప్రమాదవశమున పట్టా తప్పి పడిపోయినది. చాలమందికి నష్టం కలిగింది. వివరాలింకా తెలియవు.

ఇదేమిటి, ఇలా చెప్పాడు. రాత్రి మద్రాసు వచ్చే ప్యాసింజరంటే... రాధాకృష్ణుడు వెళ్ళినదేగా... పెద్ద... ప్రమాదం... జరిగింది. అనుకుని ఒక్కసారి వేడిగా నిట్టూర్చింది...

అదుగో వాళ్ళనాన్న వాళ్లు ఏమిటో గల్లంతు పడుతున్నారు. అతని స్నేహితులంతా గుమిగూడి ఏమిటో చెప్పుకుంటున్నారు. ఏమిటో తనుకూడ వాళ్ళలోకి వెళ్ళి వింటే ? ఏమనుకుంటారో...

తనొక్కతే ఏమని నిర్ణయించుకుంటుంది.

ఇంక అయిదునిముషాలేగా మిగిలివున్నది.

రాధాకృష్ణుడు మాట్లాడుతాడుగా...తనని తప్పకుండా రమ్మని చెప్పాడు. ఆ మాట గట్టిగా మదేసుకున్నేగా తనిక్కడికి వచ్చి కూచుంది-

వాళ్ళంతా దగ్గరగా వెడుతున్నారు వినటానికి. తనుకూడ కొంచెం దగ్గరగా వచ్చి పచ్చిగడ్డిలో చతికిలబడింది. మనస్సులో ఏమిటోగా వుంది. రాధాకృష్ణుణ్ణిగురించి అనేక వూహాలు పొడసూపుతున్నై. రేడియో ఇంకా అట్లాగే మోగుతూంది. దానివంకకు చూస్తే ఏమిటో పెద్దపులల్లే వున్నది.

ఇంతటితో వార్తలు సమాప్తి.

ఒక్కమాట వినపడింది.

అమ్మయ్యా ఇక రాధాకృష్ణుడు మాట్లాడడమే తరువాయి.

రెండునిముషాలపాటు నిశ్శబ్దం...

ఆలిండియా రేడియో మద్రాసు కేంద్రం...

ఒక్కనిముషం ఆగారు...ఎందుకూ అగుతారేం రాధాకృష్ణుడేగా మాట్లాడేది. అటువైపుకే తదేకంగా చూస్తోంది...


"క్షమించాలి.. ఇప్పటి కార్యక్రమం ప్రకారం రాధాకృష్ణరావుగారు రాజాలనందున ఆయన ప్రసంగవ్యాసమును చదువుతున్నాం.

అరే...కూచున్నదల్లా ఒక్కసారి త్రుళ్లిపడింది. రాధాకృష్ణుడు ఎందుకు వెళ్ళలేదు? మద్రాసు వెడుతున్నానని తనతో ఎంతో ఇదిగా చెప్పాడు. ప్రొద్దున్నే చేరుకునుండవలసింది. గాభరాగా ఎన్నో ఎన్నో విచారించసాగింది. ఆవిడ మనస్సు ఆ నిముషంలో ఒక్కసారి మద్రాసువరకూ పరుగులు తీసింది. ఎక్కడా రాధాకృష్ణుడు కనపడలా...

ఈ మాట వినేసరికి అతనితో చదువుకున్న విద్యార్థులంతా గొల్లుమని లేచారు.

పాపనూ తల్లిదండ్రులకి అతనే ఆధారం. మా నాయన రేడియోలో మాట్లాడుతాట్ట. అని వాళ్ళిద్దరూ ఎంతో ఇదిగా పొద్దున్నే వచ్చారు. ఇందాకా మాట. ఇప్పుడీ మాట వినపడేప్పటికి గుండెల్లో రాయిపడినట్లయింది. రెండుచేతులూ నడుమున పెట్టుకుని మోహం వేలాడవేసుగుని ఇవతలకు లేచివస్తున్నారు. స్నేహితులంతా తలోక మాట చెప్పుగుంటూ అటువైపుకే వస్తున్నారు కూడా.

## * మంచి సలహా *



"ఏమండీ, ఈ పౌడరు డబ్బాను ఇక్కడ పుచ్చుకుందామా, లేక మన ఇంటిదగ్గరి దుకాణంలో కొందామా?"

"వద్దు, వద్దు, ఇక్కడే కొను. మనం ఇంటిదగ్గరి దుకాణం చేరుకునేలోపున ధరలు పెరిగిపోతాయేమో, ఎవరు చెప్పగలరు?"

---

"ఏం నాయనా ఆంజనేయులూ, మా వాడు ఎందుకు వెళ్లలేదు?" తల్లి ఎంతో ఆదుర్దాగా అడిగింది.

"ఏం నాయనా మా వాడు నిన్న నీకేం జెప్పాడు వెళ్లేటప్పుడు?" నాన్నకూడ ఎంతో ఇదౌతూ అడిగాడు. అంతా కలిసి ఏమిటో ఆదుర్దాగా ఇంటికి వెళుతున్నారు అడుగులో అడుగేసుకుంటూ. అమ్మ నాన్న వెనకవెనక్కే తిరిగిచూస్తారు మాటిమాటికి. అందులో ఏ మాటన్నా రాధాకృష్ణుడిది వినపడుతుందేమోని వాళ్ళ ఆశ...

రుక్మిణి మనస్సు ఒకమూల అలా ఖేదపడుతూనే వుంది. తనొక్కతే కూచుంది. అంతా తలోకమాట చెప్పుగుంటూ పోతున్నారు. మందారచెట్టు ప్రక్కగా వొదిగి నుంచుంది వాళ్ళ మాటలేమిటో విందామని- ఎవరిమాట నమ్మడం...

ఎందుకనో ఉన్నకొద్దీ మనసులో భయం మరీ ఎక్కువైంది. గుండెలమీద చెయ్యివేసుగుని చూసుగుంటే దడదడా కొట్టుకుంటున్నాయ్. కాలుకాలిన పిల్లిలాగ ఆ చెట్టుదగ్గరనుంచి ఈ

---

* ఆనంద వాణి

చెట్టుదగ్గరకి ఈ చెట్టుదగ్గరనుంచి ఆ చెట్టుదగ్గరకి తిరుగుతుంది. మేము మాత్రం ఏం చెప్పము, అన్నట్లుగా తనవంక దీనంగా చూసినాయ్. అక్కడి నుంచి వెళ్ళి బెంచిమీద కూచున్నది. మొన్న రాధాకృష్ణుడు ఇక్కడే కూచుని తను వ్రాసి ఇచ్చిన కథను చదివాడు: రుక్మిణి అక్కడే కూచున్నది నేలవంకకు దీనంగా చూస్తూ, బొటన వ్రేలితో ఇసుకలో రాస్తూ...

రేడియోలో ఏం మాట్లాడుతున్నారో తనకేం కావాలి? అంతా పిచ్చివాగుడు ఒక ప్రక్కకు వొరిగి బెంచిమీద మోచేయి ఆనుకుని దిగాలపడి కూచుంది.

ఎంతసేపు కూచున్నా తనకి రాధాకృష్ణుడి సంగతి ఎవరు చెబుతారు? ఏమైనాడనుకుని ఇక్కడినుంచి లేచి వెడుతుంది.

రేడియో తనకేమన్నా రాధాకృష్ణుడి కబురు చెబుతుందా? ఏమో దానివంకకు చూస్తే భయమేస్తోంది. దానికి చైతన్యం లేదు. జాలి లేదు. అవతలవాళ్లు బాధపడతారని లేదు. ఎంతమాటైనా అట్టే చెప్పేస్తుంది... మనస్సు కలవరం చెందుతుండగానే...

ఇంతవరకు మీరు విన్నది రాధాకృష్ణరావుగారి సాహిత్యవీధులు అనే ప్రసంగ వ్యాసం.

రెండునిముషాలునిశ్శబ్దం... లేచికూచుంది రుక్మిణీ రేడియోవంకకు తలెత్తి చూస్తోంది.

ఒక విషాదవార్త...

ఇంతవరకూ అనుమానంతో కలవరం చెందుతున్న ఆవిడ హృదయంలో ఏదో చెప్పరాని బాధను కలిగించిం దీమాట. పాడు రేడియో ఏం చెబుతుందో....

అలా చూస్తూ వుండగానే...

మా నిలయ విద్వాంసులు గోపాలరావుగారి కథనం ప్రకారం రాత్రి తమతో కూడ ప్రయాణం చేస్తున్న రాధాకృష్ణరావుగారు రైలు ప్రమాదం వలన చనిపోయినారు- వారి తల్లితండ్రులకి మా సానుభూతి.

అమ్మో నేను వినలేను- చెవులు రెండూ గట్టిగా మూసుకున్నది- అలాగే వెనక్కు వొరిగింది- పాడు రేడియో ఎంతమాట చెప్పింది- రాధాకృష్ణుడు రైలుక్రింద...అమ్మో...

తనింతసేపు కూచున్నందుకు ఇదేనా వార్త-

